https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

4 PM TO 7 PM

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

98497 67747 | 9494184136

సంపుటి: 01 / సంచిక:30 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / మంగళవారం, సెప్టెంబర్ 15,2026



# ఏఐ భయాందోళనలన్నీ అబద్ధం

న్యూయార్క్: ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15

కృత్రిమ మేధపై ఇటీవల భయాందోళనలు వ్యక్తం అవుతున్న విషయం తెలిసిందే. ఏఐతో మానవాళి అంతం అవుతుందని కొందరు నిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆ వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్(ణశీఉఖశ్రీఎ ుతీబఎజూ) స్పందించారు. ఏఐ భద్రత గురించి వస్తున్న భయాలు అన్నీ అబద్ధం అని అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ అంశంలో జాగ్రత్తలు తీసుకోవాలని వస్తున్న అభిప్రాయాలను ఆయన విమర్శించారు. ఏఐ పరిశ్రమలో జరుగుతున్న టెక్నాలజీ పరీక్షలను చెక్ చేసేందుకు థార్ట్ పార్టీ అవసరమని ఆంత్రోపిక్ సహ వ్యవస్థాపకుడు జాక్ క్లార్క్ వ్యాఖ్యలు చేయడంతో ట్రంప్ కూడా ఆ అంశంపై స్పందించారు.

## మాస్క్ వేస్కున్న దుండగులను ఎవరో పంపించారు..

# స్థానికులైతే పట్టుకొచ్చి అరెస్ట్ చేశారా..?

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15



సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఆర్వో మహేశ్, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ముసుగులు ధరించిన కొంతమంది వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌లోకి ప్రవేశించి కేటీఆర్ సిబ్బందిపై దాడికి యత్నించారని బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేపట్టగా.. అసలు ఎలాంటి దాడి జరగలేదని పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించామని, దాడికి సంబంధించిన ఎలాంటి ఘటన కనిపించలేదని ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డీసీపీ శిల్పవల్లికి ప్రశ్నలు సంధించారు.

# యూకేను వీడుతాం..

## చారిత్రక ఒప్పందంపై స్కాట్లాండ్, వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్ సంతకాలు..!



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15

యునైటెడ్ కింగ్‌డమ్ లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. స్కాట్లాండ్ , వేల్స్ , నార్తర్న్ ఐర్లాండ్ లలోని ప్రధాన జాతీయవాద పార్టీల నేతలు ఒక్కతాటిపైకి వచ్చారు. తమ దేశాలకు స్వయం నిర్ణయాధికారం ఉందని స్పష్టంచేస్తూ ఒక చారిత్రక ఒప్పందంపై సంతకాలు చేశారు. రాజ్యాంగపరమైన మార్పులకు బ్రిటిష్ ప్రభుత్వం సిద్ధం కావాలని వారు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ పరిణామం యూకే రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఈనెల 17 న ఉపరాష్ట్రపతి పర్యటన



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15:

సెప్టెంబర్ 17 వ తేదీన హైదరాబాద్ నగరంలో రాష్ట్ర ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత కార్యదర్శులు, పోలీసు అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, ఈనెల 17 న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవం కార్యక్రమంలోముఖ్య అతిధిగా పాల్గొనడానికి ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ వస్తున్నారని తెలిపారు. 17 న ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ కు చేరుకొని ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖలు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నాయని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ , డీజీపీ సీవీ ఆనంద్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, హైదరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమీషనర్లు సజ్జనార్, సుమతి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నార్నూర్, గాదిగూడ మండలాల అభివృద్ధికి కృషి చేయండి:

ఆదిలాబాద్ కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పర్యటించిన కోవ లక్ష్మి

ఇందిరమ్మ ఇళ్లు, పంచాయతీ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరిన లక్ష్మి

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15

ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలోని నార్నూర్, గాదిగూడ మండలాల అభివృద్ధికి మరియు స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు.

# ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు..

## కాంగ్రెస్ ఓటమి ఖాయం: కవిత

ఉద్యోగులతో విభేదించిన ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి రాలేదని కవిత వ్యాఖ్య

కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని విమర్శలు

ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ

630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలే ఉన్నారని విమర్శ

పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపణ

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15

ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు.



## సైఫాబాద్ ఘటనపై కేటీఆర్‌కు ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

# కౌంటర్

కేటీఆర్ కంటే తాము ఘాటుగా తిట్టగలమన్న వెంకట్

తమ తల్లిదండ్రులు సంస్కారం నేర్పించారని వ్యాఖ్య

తాతా మధు వాడిన భాషనే కేటీఆర్ పీఏ, పీఆర్వోలు పోలీసులపై వాడారని మండిపాటు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన పీఏ, పీఆర్వోల ప్రవర్తనపై తెలంగాణ ప్రభుత్వ విప్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రతిపక్షంలో ఉన్నామనే నిరాశతో బీఆర్ఎస్ నేతలు మీడియా దృష్టిని ఆకర్షించేందుకే నాటకాలాడుతున్నారని దుయ్యబట్టారు.

## మాజీ ప్రధాని షేక్ హసీనా సన్నిహితులు ఏడుగురికి మరణశిక్ష..

# ఖరారు చేసిన బంగ్లాదేశ కోర్టు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆమె సన్నిహితులు ఏడుగురికి బంగ్లాదేశ్‌కు చెందిన ఒక కోర్టు మరణశిక్ష విధించింది. 2024లో జరిగిన అల్లర్ల సందర్భంగా ఏడుగురిని నిందితులుగా పరిగణిస్తూ బంగ్లాదేశ్‌కు చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్-2 ఈ మరణశిక్ష ఖరారు చేసింది.మానవత్వానికి వ్యతిరేకంగా నిందితులు వ్యవహరించారని జస్టిస్ మొహమ్మద్ నజ్రుల్ ఇస్లాం చౌదరి తీర్పు వెల్లడించారు. 2024లో బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ఆధ్వర్యంలోని అవామీ లీగ్ ప్రభుత్వంపై ఆందోళనకారులు తిరగబడ్డ సంగతి తెలిసిందే. ఆందోళనల్ని అణచివేయడానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరించిందని అక్కడి ప్రతిపక్షాలు, ఆందోళనకారులు అంటున్నారు. ముఖ్యంగా ఏడుగురు నిందితులు సమావేశమై, ఆందోళనల్ని అణచి వేసేందుకు కుట్రలు చేశారని, హింసకు పాల్పడ్డారని వారిపై అభియోగాలు నమోదయ్యాయి.దీనిపై విచారణ జరిపిన కోర్టు ఏడుగురు నిందితులకు మంగళవారం మరణశిక్ష విధించింది. మాజీ ప్రధాని షేక్ హసీనాపై గత ఏడాదే ఇదే అంశంలో అక్కడి కోర్టు మరణశిక్ష విధించింది. ఇప్పుడు ఆమె అనుచరులకు శిక్ష పడింది. తాజాగా శిక్షకు గురైన వారిలో అవామీ లీగ్ పార్టీ ప్రధాన కార్యదర్శి, బంగ్లాదేశ్ మాజీ మంత్రి ఒబైదుల్ ఖాదర్, జాయింట్ సెక్రెటరీ బహావుద్దీన్ నసీమ్, మాజీ సమాచార మంత్రి అలీ అరాఫత్, జూబో లీగ్ చైర్మన్ షేక్ ఫాజిల్ షామ్స్ పరాష్, ఈ సంస్థ జనరల్ సెక్రెటరీ మైనుల్ హొసైన్ ఖాన్ నిఖిల్, బంగ్లాదేశ్ ఛాత్రా లీగ్ ప్రెసిడెంట్ సద్దాం హొసైన్, జనరల్ సెక్రెటరీ షేక్ వాలి అసిఫ్ ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి

## నార్నూర్, గాదిగూడ మండలాల అభివృద్ధికి కృషి చేయండి:

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ఆమె ఈరోజు నార్నూర్ మండలంలోని జామాడ, బలాన్‌పూర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు, పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు.మండలాల్లోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. 'భూ భారతి' కార్యక్రమంలో భాగంగా అర్హులైన రైతులకు కోవ లక్ష్మి భూ హక్కు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి మాట్లాడుతూ... నార్నూర్, గాదిగూడ మండలాల్లో నెలకొన్న ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మెస్రం చందుర్ షావ్, తహసీల్దార్ జాడి రాజాలింగం, డీఎల్‌పీఓ ప్రభాకర్, ఎంపీడీవో పుల్లారావు, ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి ఆకాశ్, సీడీపీఓ శారద, ఎంఈఓ మనోహర్ తదితరులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు..

తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు.
తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు.విద్యార్థుల వివరాలు, రిపోర్టుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు.ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయలేదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించలేదని అన్నారు.

మొదటిపేజీ తరువాయి

## సైఫాబాద్ ఘటనపై కేటీఆర్‌కు ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ కౌంటర్

కేటీఆర్ కంటే ఘాటుగా తిట్టడం తమకు వచ్చని, అయితే తమ తల్లిదండ్రులు విజ్ఞత, సంస్కారం నేర్పించారని పేర్కొన్నారు. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్ పీఏ, పీఆర్వోలపై ఎలాంటి దాడి జరగలేదని ఉన్నతాధికారులు ఇప్పటికే తేల్చిచెప్పారని, గణేశ్ మండపం డీజే అనుమతి కోసం వచ్చిన కొందరు యువకుల సమక్షంలో కేటీఆర్ సిబ్బంది అనవసరంగా రాద్ధాంతం చేశారని మండిపడ్డారు.స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు వాడిన అనుచిత భాషనే కేటీఆర్ పీఏ, పీఆర్వోలు కూడా పోలీసులపై ఉపయోగించారని, ఇది కేటీఆర్ అహంకారపూరిత వైఖరికి నిదర్శనమని విమర్శించారు. బీఆర్ఎస్ తీరు వల్ల ఒక సామాజిక వర్గానికి చెడ్డపేరు వస్తోందని, తెలంగాణ సమాజానికి, దళితులకు కేటీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తన పక్కటెముకలు విరిగినా ఏనాడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదని వెంకట్ అన్నారు. కేటీఆర్ సిబ్బంది ప్రవర్తన మార్చుకోకపోతే పోలీసులు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

మొదటిపేజీ తరువాయి

## యూకేను వీడుతాం.. చారిత్రక ఒప్పందంపై స్కాట్లాండ్, వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్ సంతకాలు..!

ఈ పరిణామం యూకే రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.నిన్న కార్డిఫ్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ చారిత్రక ఒప్పందం కుదిరింది. స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్, ఎస్ఎన్‌పీ నేత జాన్ స్విన్నీ, వేల్స్ ఫస్ట్ మినిస్టర్, ప్లాయిడ్ క్రమ్రీ పార్టీ అధినేత రూన్ ఆప్ ఇయర్వర్త్, నార్తర్న్ ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్, సిన్ ఫెయిన్ పార్టీకి చెందిన మిషెల్ ఓ 'నీల్ ఈ 'మెమొరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ (వీశీఖ)' పై సంతకాలు చేశారు. ఈ సమావేశంలో సిన్ ఫెయిన్ పార్టీ అధ్యక్షురాలు మేరీ లౌ మెక్‌డొనాల్డ్ కూడా పాల్గొన్నారు.యూకే వ్యాప్తంగా రాజకీయ వాతావరణం మారుతోందని, తమ దేశాల భవిష్యత్తును నిర్ణయించుకునే హక్కు తమ ప్రజలకు ఉందని ఈ ఒప్పందంలో వారు స్పష్టంచేశారు. ప్రజాస్వామ్యాన్ని అడ్డుకునే హక్కు ఏ వెస్ట్‌మిన్‌స్టర్ (బ్రిటిష్) ప్రభుత్వానికీ లేదని, వెస్ట్‌మిన్‌స్టర్ పాలనకు కాలం చెల్లిందని ఈ ఒప్పంద పత్రంలో పేర్కొన్నారు. యూకేలోని మూడు దేశాల్లోనూ స్వాతంత్ర్యం కోరుకునే ఫస్ట్ మినిస్టర్లు ఏకకాలంలో అధికారంలో ఉండటం ఇదే మొదటిసారని వారు గుర్తుచేశారు.ఆర్థిక వ్యవస్థ, ఇంధన రంగాల్లో పరస్పర సహకారం పెంచుకోవాలని, తమ దేశాల భవిష్యత్తు యూరోపియన్ యూనియన్‌తోనే ముడిపడి ఉందని వారు అభిప్రాయపడ్డారు. అయితే ఈ కూటమిలోని పార్టీలకు వేర్వేరు లక్ష్యాలు, ప్రాధాన్యతలు ఉన్నాయి. స్కాట్లాండ్ స్వాతంత్ర్యం కోసం మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని స్కాటిష్ నేషనల్ పార్టీ కోరుతోంది. 2014లో జరిగిన రిఫరెండంలో 45% ప్రజలు యూకేకు వ్యతిరేకంగా, 55% మంది యూకేలోనే కొనసాగేందుకు మొగ్గు చూపారు. దాంతో రెఫరెండం వీగిపోయింది.ఇక నార్తర్న్ ఐర్లాండ్‌ను రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్‌తో విలీనం చేయాలని 'గుడ్ ఫ్రైడే ఒప్పందం' కింద సిన్ ఫెయిన్ పార్టీ పోరాడుతోంది. వేల్స్ స్వాతంత్ర్యానికి ప్లాయిడ్ క్రమ్రీ పార్టీ మద్దతిస్తున్నా, రిఫరెండం కోసం నిర్దిష్ట కాలపరిమితిని ప్రకటించలేదు. కాగా ఈ మూడు దేశాల చారిత్రక ఒప్పందానికి బ్రిటిష్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్ ప్రభుత్వం పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. యునైటెడ్ కింగ్‌డమ్ ఐక్యతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రస్తుతం దేశంలో నెలకొన్న జీవన వ్యయ సంక్షోభాన్ని పరిష్కరించడంపైనే దృష్టి సారించామని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.మరోవైపు ఈ ఒప్పందంలో మిషెల్ ఓ'నీల్ పాల్గొనడాన్ని నార్తర్న్ ఐర్లాండ్‌లోని డెమోక్రటిక్ యూనియనిస్ట్ పార్టీ వంటివి విమర్శించాయి. ఇదిలావుంటే ఈ ఒప్పందానికి తక్షణ చట్టపరమైన బలం లేనప్పటికీ, యూకేలో రాజ్యాంగపరమైన సమస్యలను సజీవంగా ఉంచడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

## ఏఐ భయాందోళనలన్నీ అబద్ధం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీలకు చెందిన పలువురు నిపుణులు కూడా కొన్ని రోజులగా ఏఐపై భయాందోళనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆ అనుమానాల వల్ల ఏఐ కంపెనీల షేర్లు పడిపోయాయి. సోషల్ మీడియా పోస్టులో ట్రంప్ స్పందిస్తూ.. ఏఐపై గ్లోబల్ వార్నింగ్ స్కామ్ ఉత్తదే అని, ర్యాడికల్ లెఫ్ట్ డెమోక్రాట్లు ఆ వదంతలు వ్యాపింప చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ నకిలీ వార్తల గుట్టును తాను విప్పుతున్నట్లు చెప్పారు. ఇది రష్యా నకిలీ బెదిరింపులు అని కూడా ఆయన అన్నారు.ఏఐ రక్షణ కోసం కావాల్సింది బలమైన, స్మార్ట్ అధ్యక్షుడు అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. ఏఐ, డేటా సెంటర్లకు వ్యతిరేకంగా ఓ కుట్ర సాగుతోందని, ఈ అంశంలో కేవలం ఒక్క చైనా మాత్రమే సంతోషంగా ఉందని, ఏఐలో ఎవరు విజయం సాధిస్తే, వాళ్లే గెలిచినట్లు అవుతుందని ట్రంప్ అన్నారు. ఏఐ రంగంలో చైనా సాధిస్తున్న అభివృద్ధి పట్ల అమెరికా ఆందోళన చెందుతోందని, ఆ దేశం తన విధానాలను కూడా మార్చుకుంటోందని చైనీస్ మీడియాలో ఇటీవల నిపుణులు పేర్కొన్నారు. ఏఐ పరిశ్రమలో చైనా నుంచి గట్టి పోటీ వస్తున్న విషయాన్ని అమెరికా గ్రహించిందని, ఒకవేళ అమెరికా ఆ రంగంలో మందగిస్తే, అప్పుడు ఏఐ వేగాన్ని చైనా అందుకుంటుందని ఫుడాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జిన్ క్వియాంగ్ పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## మాస్క్ వేస్కున్న దుండగులను ఎవరో పంపించారు..

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇదేదో యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన కాదని తెలంగాణ ప్రజలకు చెప్పదలచుకుంటున్నా.. కావాలని 6:30 గంటలకు వాళ్లను వదలకుండా.. అదే టైంకు సరిగ్గా ఈ మాస్క్ వేస్కున్న దుండగులను ఎవరో పంపించారు. అది డీసీపీ చెప్పాలి.. డీజే పర్మిషన్ కోసం స్థానికులు కొద్ది మంది డీజే పర్మిషన్ కోసం సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు వస్తే వాళ్లు నిరాకరిస్తే గొడవ జరిగిందంటున్నారు.. డీసీపీ మేడమ్ మీకు కూడా 10-12 సంవత్సరాల సర్వీస్ ఉంటది.. మీరు డీజే పర్మిషనే మీరు ఇవ్వడం లేదు.. ఒకవేళ ఇవ్వాలన్నా వాళ్లు ముందు మీ సేవలో అప్లై చేయాలి. చేసిన తర్వాత వాళ్ల సెక్టార్ ఎస్ఐ దగ్గరకు పోతడు. సెక్టార్ ఎస్ఐ తర్వాత స్టేషన్ ఆఫీసర్ దగ్గరకొస్తడు. అంటే సీఐ ర్యాంక్ ఆఫీసర్ దగ్గరికొస్తడు. వచ్చినా కూడా ఒక్కరో ఇద్దరో వస్తరు.. పర్మిషన్ కోసం 15-30 మంది రారు మేడమ్. వచ్చేటోడు మాస్క్ ఎందుకు వేసుకుని వస్తడు మేడమ్ అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.డీసీపీ శిల్పవల్లి దయచేసి ఈ విషయం చెప్పాలి.. లేకపోతే మిమ్మల్ని వెనుక నుంచి గైడ్ చేస్తున్న ఆఫీసర్లు వాళ్లు ఇంటెలిజెన్స్ వాళ్లా.. లేకపోతే హైదరాబాద్ సిటీ పోలీసులా, డీజీపీనా.. వాళ్లైనా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలన్నారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. డీజే పర్మిషన్ కోసం ఒకరు లేదా ఇద్దరొస్తరు.. కానీ 15 నుంచి 30 మంది ఎందుకొస్తరో చెప్పాలి మేడమ్ అన్నారు. పోని స్థానికులు అని అన్నరు.. మరి స్థానికులైతే ఒక్కరినైనా పట్టుకొచ్చి అరెస్ట్ చేశారా..? స్థానికులని మీరే అంటున్నరు.. ఎట్లా చెప్తున్నరు.. స్థానికులని మే బేసిస్ మీద చెప్తున్నరు.. స్థానికులైతే మీరు తీసుకురండి.. రాత్రికి రాత్రి మీరు టాస్క్‌ఫోర్స్ ను పంపించి తీసుకురావొచ్చు కదా.. ఎంతసేపు మేడమ్ మీ దగ్గరు ఇంతమంది పోలీసువాళ్లున్నారు అని ప్రశ్నించారు.

## క్యాన్సర్‌ను పసిగడుతున్న శునకాలు..

### పరిశోధనల్లో నమోదవుతున్న అత్యంత కచ్చితత్వం..



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15

క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స మరింత ప్రభావవంతంగా ఉండే అవకాశం ఉంటుంది. అయితే ఖరీదైన పరీక్షలు, వైద్య సదుపాయాల కొరత కారణంగా అనేక మంది రోగుల్లో వ్యాధి ముదిరిన తర్వాతే క్యాన్సర్ నిర్ధారణ అవుతోంది. ఈ నేపథ్యంలో కుక్కల అద్భుతమైన వాసన గుర్తించే సామర్థ్యాన్ని కృత్రిమ మేధతో అనుసంధానించి క్యాన్సర్‌ను గుర్తించే చవకైన, శరీరంలో ఎలాంటి జోక్యం లేని పరీక్షను అభివృద్ధి చేసేందుకు బెంగళూరుకు చెందిన ఒక సంస్థ ప్రయత్నిస్తోంది. బెంగళూరు శివార్లలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో క్లోయీ అనే కుక్కకు మనుషుల శ్వాసలో క్యాన్సర్‌కు సంబంధించిన వాసనలను గుర్తించే శిక్షణ ఇస్తున్నారు. కుక్క శరీరానికి ప్రత్యేకంగా రూపొందించిన త్రీడీ ముద్రిత హెల్మెట్, సెన్సార్లతో కూడిన పరికరాలను అమర్చారు. కుక్క వాసనను గుర్తించే సమయంలో దాని మెదడు కార్యకలాపాలు, శ్వాస, శరీర కదలికలను నమోదు చేసి, వాటిని కృత్రిమ మేధ ద్వారా విశ్లేషించే విధానాన్ని సంస్థ అభివృద్ధి చేస్తోంది.

### వాసన గ్రాహకాలు అధికం..

కుక్కలకు మనుషులతో పోలిస్తే వాసనలను గుర్తించే సామర్థ్యం ఎంతో ఎక్కువగా ఉంటుంది. కుక్కలు దాదాపు 30 కోట్ల వాసన గ్రాహకాలను కలిగి ఉంటే, మనుషుల్లో వాటి సంఖ్య సుమారు 50 లక్షలుగా ఉంటుంది. వ్యాధుల కారణంగా మన శరీరం నుంచి విడుదలయ్యే కొన్ని రసాయనాల్లో మార్పులు చోటుచేసుకోవడం వల్ల ప్రత్యేకమైన వాసనలు ఏర్పడవని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ ప్రత్యేకమైన వాసనలను కుక్కలు గుర్తించగలవనే ఆలోచనతో క్యాన్సర్ గుర్తింపుపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ విధానంలో రోగులు కుక్కలను నేరుగా కలవాల్సిన అవసరం ఉండదు. ముందుగా సుమారు 10 నిమిషాల పాటు పత్తితో తయారు చేసిన మాస్క్‌లోకి శ్వాసను వదలాలి. అనంతరం ఆ మాస్క్‌ను ఒక సంచిలో భద్రపరిచి ప్రయోగశాలకు తరలిస్తారు. అక్కడ శిక్షణ పొందిన కుక్కలు ఆ నమూనాలను పరిశీలిస్తాయి.

## ఏపీలో స్థానిక ఎన్నికలకు వేగంగా అడుగులు..

# ఈనెల 22న ఓటర్ల జాబితా



- ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగవంతం
- 41 పట్టణ స్థానిక సంస్థలకు ఓటర్ల జాబితాల రూపకల్పనకు ఆదేశాలు
- ఈ నెల 22న తుది ఓటర్ల జాబితాలను ప్రచురించనున్న ఎన్నికల సంఘం
- 2026 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎస్ఈసీ
- ఇటీవలే 59 మున్సిపాలిటీలకు కూడా ఇదే తరహా నోటిఫికేషన్ జారీ

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును వేగవంతం చేసింది. మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేసే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా 41 పట్టణ స్థానిక సంస్థలకు ఫోటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ నోటిఫికేషన్ పరిధిలో రాష్ట్రంలోని 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు మరియు నగర్ పంచాయతీలు ఉన్నాయి. ఈ సంస్థలన్నింటికీ ఓటర్ల జాబితాలను రూపొందించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎస్ఈసీ ఆదేశించింది. అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన తాజా ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ఈ జాబితాలను తయారు చేయనున్నారు.2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా (ఙఖుశ్రీఱటఱఅస్త్ర ఙఖ్వ) ఎస్ఈసీ నిర్ణయించింది. ఈ తేదీ నాటికి ఓటు హక్కు పొందిన వారి పేర్లతో జాబితాలను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితాలను ఈ నెల 22న ప్రచురించనున్నట్లు ఎన్నికల సంఘం తన నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొంది.ఇటీవలే మరో 59 మున్సిపాలిటీలలో ఓటర్ల జాబితాల తయారీకి కూడా ఎస్ఈసీ ఇదే తరహాలో నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా నోటిఫికేషన్‌తో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. వరుస నోటిఫికేషన్ల నేపథ్యంలో త్వరలోనే రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నగారా మోగనుందని స్పష్టమవుతోంది.

## మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి లొంగుబాటు



నిజామాబాద్ సీపీ ముందు లొంగిపోయిన నక్కా సుశీల

తెలంగాణలో మావోయిస్టులు పూర్తిగా దెబ్బతిన్నారన్న పోలీసు అధికారులు

మరో ముగ్గురు తెలంగాణ నేతలే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15

దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదంలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకురాలు, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి (అలియాస్ లత/లలిత/రేలా/జ్యోతి) లొంగిపోయారు. నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఎదుట ఆమె మంగళవారం అధికారికంగా లొంగిపోయారు. సుశీల సరెండర్‌తో మావోయిస్టుల పునర్నిర్మాణ సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, ఇది రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద పతనానికి ముగింపు దశగా నిలిచిందని పోలీసులు అభివర్ణించారు.ఈ చారిత్రాత్మక పరిణామంతో 2026 సంవత్సరం తెలంగాణ పోలీసు శాఖ పోరాటంలో ఒక కీలక మలుపుగా మారింది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ూ×దీ), గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయంతో సాగించిన వ్యూహాత్మక చర్యల వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో మొత్తం 266 మంది అజ్ఞాత మావోలు హింసామార్గాన్ని వీడి లొంగిపోయారు.ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు/సభ్యులు ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరితో పాటు 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు లొంగిపోవడంతో పార్టీ నెట్‌వర్క్ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పూర్తిగా ఛిన్నాభిన్నమైందని వెల్లడించారు.ప్రస్తుతం తెలంగాణకు చెంది బయటి రాష్ట్రాల్లో పనిచేస్తున్న ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు (గణపతి), జడె రత్నబాయి (సుజాత), వార్త శేఖర్ (మంగు) అనే ముగ్గురు నేతలు మాత్రమే అజ్ఞాతంలో మిగిలారని పోలీసులు ధ్రువీకరించారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీన పడిందని... అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారందరూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని ఉపయోగించుకుని సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.



## మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని కన్నుమూత

అమరావతి :ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 15

ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని(ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్) మంగళవారం విశాఖలోని ఆయన నివాసంలో గుండె పోటుతో కన్నుమూశారు. ఏలూరు నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాని జగన్ హయాంలో డిప్యూటీ సీఎంగా పని చేశారు. కరోనా సమయంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా ఆళ్ల నాని కీలక బాధ్యతలు నిర్వహించారు. 2024 ఎన్నికల తర్వాత వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136